క్లుప్తంగా

సీహెచ్‌సీకి మరో ఇద్దరు వైద్యులు

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి సోమవారం మరో ఇద్దరు వైద్యులను నియమించారు. ఈ మేరకు నూతనంగా వచ్చిన వైద్యులు నర్సయ్య, నాతానియల్ సీహెచ్‌సీ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణ చంద్ సమక్షంలో జాయినింగ్ రిపోర్ట్ అందించి, విధుల్లో చేరారు. ఏజెన్సీ ప్రాంత వాసులకు 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రైలు పునఃప్రారంభంపై హర్షం

మణుగూరురూరల్: బెళ్గావి–మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలును పునఃప్రారంభించడంపై బీజేపీ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాడి దేవేంద్ర వరప్రసాద్ మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ బండి సంజయ్ కేంద్ర రైల్వేశాఖ మంత్రి దృష్టికి ప్రయాణికుల ఇబ్బందులను తీసుకెళ్లడంతో బెళ్గావి–మణుగూరు ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిత్ర సరస్వతి, లింగంపల్లి రమేష్, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులను ఖండించండి

మణుగూరురూరల్: బెల్లంపల్లి, రామగుండం ఏరియాల్లో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ఇఫ్టూ నాయకులను ప్రభుత్వం పోలీసుల చేత ముందస్తు అరెస్ట్‌లు చేయించడం అక్రమమని, ఈ అరెస్టులను ప్రతీ ఒక్కరు ఖండించాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ అన్నారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు గురుమూర్తి, నారాయణ, నాగేశ్వరరావు, రామకృష్ణ, టైసన్ పాల్గొన్నారు.

కలెక్టర్, పీఓలకు వినతి

అశ్వారావుపేటరూరల్: జిల్లా కలెక్టర్ అనుదీప్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రూలకు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమాల్లో పలు సమస్యలపై వినతిపత్రాలను వేర్వేరుగా అందించారు. మండల పరిధిలోని మల్లాయిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ నారం రాజశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీలోని కొండతోగు గ్రామానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసి, కొండతోగు నుంచి అనంతారం గ్రామానికి బీటీ రోడ్డు, పాలవాగుపై వంతెన మంజూరు చేయాలని కోరారు. అలాగే మల్లాయిగూడెం నుంచి జగన్నాథపురం, తాటి నాగులగుంపు గ్రామాలకు బీటీ రోడ్లు, దిబ్బగూడెం పండువారిగూడెం గ్రామాల్లో రైతుల పొలాలకు వెళ్లేందుకు రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని వినతి చేశారు. వీటితోపాటు తాటి నాగులగుంపు, కొండతోగు, మల్లాయిగూడెం గ్రామాల్లోగల అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీలు మంజూరు చేసి, భవనాలకు మరమ్మతులు చేయాలని కోరారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

దుమ్ముగూడెం: మండలంలోని శ్రీనగర్ కాలనీలో గత 10 రోజుల నుంచి విద్యుత్ సమస్య ఉందని, దీనిని వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. పరిష్కరించకుంటే తామంతా సబ్‌స్టేషన్‌లో నిద్రిస్తామని హెచ్చరించారు. శ్రీనగర్ కాలనీలో గత 10రోజుల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయింది. కాగా గ్రామస్తులకు 2 రోజుల్లో కొత్తది అమర్చుతామని విద్యుత్ అధికారులు చెప్పి.. విద్యుత్‌ను డైరెక్ట్ చేశారు. దీంతో విద్యుత్‌పై అధిక లోడ్ వల్ల లో–విద్యుత్ సమస్య ఏర్పడింది. అధికారులను ప్రశ్నించగా ఈరోజు.. రేపు అంటూ.. సమాధానాలు చెప్తూ వస్తున్నారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి

బూర్గంపాడు: అర్హులందరికీ తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నం చంద్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రభుత్వం రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించటం లేదని ఆరోపించారు. రేషన్‌కార్డులు లేకపోవటంతో ఎంతోమంది అర్హులు పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని సున్నంబట్టి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు వగ్గెల కృష్ణమూర్తి(72) ఇటివలె అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం జరిగిన దశ దిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, టీడీపీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం వేర్వేరుగా హాజరయ్యారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కుటుంబీకులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం మామిళ్లవారిగూడెం గ్రామానికి చెందిన రామినేని బోసుబాబు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, దమ్మపేట జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వర్లు, రామినేని సత్యనారాయణ పాల్గొన్నారు.

మధుర ఫలం.. మహా ప్రియం

- అకాల వర్షాలతో తగ్గిన మామిడి దిగుబడి
- క్రమంగా పెరుగుతున్న డిమాండ్
- కిలో రూ.100 పలుకుతున్న ధైనం



మామిడి కాయలు విక్రయిస్తున్న పండ్ల వ్యాపారి

బూర్గంపాడు: మధుర ఫలం మామిడికి ఈ ఏడాది కూడా డిమాండ్ కొనసాగుతోంది. గత ఏడాది మామిడితోటలకు తెగుళ్లు ఆశించటంతో దిగుబడులు బాగా తగ్గాయి. ఈ ఏడాది తెగుళ్ల పెద్దగా లేకపోవటంతో తోటలు మంచి కాపువచ్చాయి. అయితే నెలరోజులుగా అకాల వర్షాలు, ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలుతున్నాయి. కోతకు వచ్చే సమయంలో కాయ రాలిపోవటంతో దిగుబడులు బాగా తగ్గుతున్నాయి. దీంతో మామిడి కాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి.

ఈ ఏడాది మామిడి కాయలు కూడా కొంత ఆలస్యంగానే మార్కెట్‌లోకి వచ్చాయి. ప్రస్తుతం మామిడి కాయల ధరలు కిలో వందరూపాయల వరకు పలుకుతున్నాయి. మేలురకమైన బంగినపల్లి మామిడి ధర ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. అదే విధంగా మధురంగా ఉండే పెద్ద రసాలు, చిన్న రసాల ధరలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిస్థితులలో సామాన్యుడు మామిడి కాయలు కొనుగోలు మాటెత్తలేకుండా పోతున్నాడు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మామిడికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. జిల్లాలోని మామిడి ఎక్కువగా మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఎగుమతువుతున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి కాయలు కొనుగోలు చేసి ఎగుమతులు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు కాపుదశలోనే రైతుల వద్ద నుంచి తోటలను కొనుగోలు చేసి కాయలను ఎగుమతులు చేస్తున్నారు. కొన్నేళ్లుగా మామిడి దిగుబడులు సరిగా ఉండకపోవటంతో కొందరు రైతులు మామిడి తోటలను తీసేస్తున్నారు. మామిడి తోటల స్థానంలో ఫామాయిల్ సాగు చేపడుతున్నారు.

అకాల వర్షాలు, ఈదురు గాలులు

అకాల వర్షాలు, ఈదురుగాలులతో ప్రస్తుతం మామిడి కాయలు మార్కెట్‌లోకి బాగా వస్తున్నాయి. పూర్తిగా పక్వానికి రాకముందే కాయలు నేల రాలుతుండటంతో రైతులు నష్టపోతున్నారు. రైతుల వద్ద తక్కువ ధరలకు మామిడి కాయలు కొనుగోలు చేసిన వ్యాపారులు మార్కెట్‌లో మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మామిడి కాయలను చూడగానే ఎవరికైనా నోరూరుతుండడం, సీజనల్ పండ్లు కావడంతో ధర ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలు మామిడి కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. గతంలో రెండు, మూడు నెలల పాటు మార్కెట్‌లో మామిడి కాయలు అందుబాటులో ఉండేవి. దిగుబడులు సరిగా లేనందున ఈ ఏడాది మాత్రం నెలన్నర రోజులే మామిడి కాయలు దొరికే పరిస్థితులున్నాయి.

దిగుబడులు బాగా తగ్గాయి



ఈ ఏడాది అకాల వర్షాలతో మామిడి దిగుబడి బాగా తగ్గింది. అకాల వర్షాలు, ఈదురు గాలులకు కాయలు రాలిపోయాయి. దిగుబడులు తగ్గాయి. ఇటీవల కురుస్తున్న గాలివానలకు ఉన్న కాయలు కూడా రాలిపోతున్నాయి. దిగుబడులు లేకపోవటంతో మామిడికి డిమాండ్ ఉంది. కానీ రైతులకు మాత్రం నష్టమే వస్తోంది.

– ఇమదాబత్తుని సుబ్బారావు, మామిడి రైతు

ధర ఎక్కువగా ఉంది



ఈ ఏడాది మామిడి కాయల ధరలు బాగా ఎక్కువగా ఉన్నాయి. కిలో మామిడి ధర రూ.100కు పైగానే పలుకుతోంది. కిలోకు మూడు కాయలు కూడా రావటం లేదు. దిగుబడులు లేకపోవటంతో ధరలు పెరిగాయంటున్నారు. మామిడికాయలంటే ఉన్న మక్కువతో ధర ఎక్కువగా ఉన్నప్పటికీ కొనటం తప్పటం లేదు.

– పాలం లక్ష్మిరెడ్డి, వినియోగదారుడు

పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి



సబ్‌పోస్టాఫీస్‌ను ప్రారంభిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్

ములకలపల్లి: పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని ఆ శాఖ ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ సూచించారు. మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్‌పోస్టాఫీస్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోస్టల్ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా నూతనంగా కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖ తమ సేవలను విస్తృత పరుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీబినేని వీరభద్రం, ఎంపీటీసీ శనగపాటి మోహరమణి, ఉపసర్పంచ్ శనగపాటి అంజన్‌రావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బత్తుల అంజి, ఏపీఎం రవీంద్ర, పోస్టల్‌శాఖ ఏఎస్పీ రంజిత్‌కుమార్, ఏపీఓ కె.ప్రవీణ్‌కుమార్, ఎస్‌పీఎం సత్యనారాయణ, ఏఎస్పై పుల్లారావు, గ్రామస్తులు శనగపాటి సీతారాములు, రవి, పుల్లూరి వేణుగోపాల్, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: టీఎస్ ఆర్టీసీ భద్రాచలం డిపో మేనేజర్ వి.రామారావు, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఆర్.స్వర్ణలతలు సోమవారం బూర్గంపహాడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. మొత్తం 72 వాహనాలను తనిఖీ చేసి, పత్రాలు సరిగా లేని 6 ఆటోలని సీజ్ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రామారావుతో పాటు అసిస్టెంట్ మేనేజర్ గౌతమీ, సెక్యూరిటీ హెడ్ గార్డ్, సిస్టం సూపర్ వైజర్ ఎం వీర వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో..

పట్టణంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద సోమవారం భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ పీవీఎస్ రావు ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అధికంగా మైనర్లు ద్విచక్ర వాహనాలను నడుపుతున్నట్లుగా గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాల ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా అధిక లోడ్‌తో వస్తున్న జామాయిల్ ట్రాక్టర్ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేసి, పత్రాలను పరిశీలించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

బూర్గంపాడు: గోదావరి వరద ముంపుకు గురై తీవ్రంగా నష్టపోయిన సారపాకలోని చంద్ర పుల్లారెడ్డినగర్, భాస్కర్‌నగర్ వాసులకు మెరక ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించాలని ముంపు బాధితులు సోమవారం కలెక్టర్‌ను కోరారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎన్డీ నాయకులు ముత్యాల సత్యనారాయణ మాట్లాడుతూ.. పదినెలలుగా ముంపు బాధితులు ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. మానవహక్కుల వేదిక ఉమ్మడి జిల్లా కార్యదర్శి నల్లమోతు సురేష్, గజ్జల అలివేలు, కరుణ, మర్మం లక్ష్మి, మధు, కరుణాకర్ తదితరులున్నారు.

ఘనంగా రెడ్ క్రాస్ దినోత్సవం



మాట్లాడుతున్న తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య

భద్రాచలంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం వారు సోమవారం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని క్షయవ్యాధితో బాధపడుతున్న 70 మందికి పౌష్టికాహార కిట్లను అందించారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలను అభినందించారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం బాధ్యుడు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ.. భద్రచలం డివిజన్‌లో ఎక్కువ మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని, తలసేమియా, సికెల్ సెల్ అనీమియా వ్యాధిగ్రస్తులు కూడా ఉన్నారని తెలిపారు. వారిని రక్షించేందుకు ప్రజలందరూ స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో లయన్ వై. సూర్యనారాయణ, డాక్టర్ భానుప్రసాద్, జి.రాజారెడ్డి, లయన్ జేవీఎస్ చంద్రశేఖర్, పల్లంటి దేశప్ప, ఏ.సత్యనారాయణ, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం..

అనంతరం విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తిప్పని సిద్ధులు సైనిక్ వెల్ఫేర్ డైరెక్టరేట్ మెంబర్‌గా ప్రభుత్వం నుంచి ఎంపికైనందుకు, గ్రీన్ భద్రాద్రి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి.భూపతిరావు బంగారు నంది అవార్డు పొందినందుకు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.కామేశ్వరరావులు ఎన్ఎస్ఎస్ అవార్డుకు ఎంపికైనందుకు, బ్లడ్ డోనార్స్ ఆర్గనైజర్లు కొప్పుల మురళి, ఎండి జిందా, లోకేష్ కుమార్‌లకు, టీబీ వ్యాధిని అరికట్టడంలో సేవలు అందించిన సోమయ్య, ఎం.రాజు, ఏ.వెంకటేశ్వర రావు, టి.పద్మ, సయోగ్యం బాబురావులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి డాక్టర్ నర్సింహా రెడ్డి, భద్రాచలం లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ ఎం.పూర్ణచందర్‌రావులు సహకారం అందించినట్లు డా.ఎస్ఎల్ కాంతారావు తెలిపారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

మణుగూరురూరల్: మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో హెటిరో సంస్థ అధినేత, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి అందించిన న్యూట్రిషన్ కిట్లను క్షయ వ్యాధిగ్రస్తులకు సోమవారం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఎన్‌టిఇపి సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్ని డిప్యూటేషన్లను రద్దు చేయాలి

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యంలో నడిచే గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల అన్ని రకాల డిప్యూటేషన్లను రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సోమవారం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, డీడీ రమాదేవిలకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల రద్దు చేసిన 89 డిప్యూటేషన్లు హర్షణీయమని, ఇదేవిధంగా ఇతర బోధన, బోధనేతర సిబ్బంది డిప్యూటేషన్లను కూడా రద్దు చేయాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో సంఘ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిషోర్ సింగ్, కృష్ణ, విజయ్‌కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మణుగూరుటౌన్: నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న మణుగూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలి తల్లి కవిత సోమవారం మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించింది. సంఘం జిల్లా చైర్మన్ భరత్‌రెడ్డి స్పందించి తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడాల శ్రీనివాసరావును కలిశారు. ఫిర్యాదుపై స్పందించిన హెల్త్ డైరెక్టర్.. దీనిపై వెంటనే విచారణ చేయాలని జిల్లా వైద్యాధికారులకు ఆదేశించారు.

పూజలు ప్రారంభం

దమ్మపేట: సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ సందర్భంగా పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. సోమవారం ప్రముఖ వేద పండితులు కామవరపు విజయమారుతీశర్మ గోపూజతో పూజలు ప్రారంభించారు. అనంతరం ప్రతిష్ఠకు అవసరమైన యంత్రాల పూజా కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఆలయ చైర్మన్ పసుమర్తి వీరేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి సత్తిపండు, చిన్నశెట్టి సత్యనారాయణ, భీమవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఐటీడీఏ ప్రజాదర్బార్‌లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) రమాదేవికి తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ వినతిపత్రం సమర్పించింది. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.బ్రహ్మాచారి, హీరాలాల్ మాట్లాడుతూ.. అవుట్ సోర్సింగ్ వర్కర్లకు 20 నెలల వేతనాలు, డైలీవేజ్ వర్కర్లకు నాలుగు నెలల వేతనాలు బకాయి ఉన్నాయని తెలిపారు. సమ్మక్క, రామా, వీరభద్రం, యశోద, ముసలయ్య, నాగమణి, సత్తెమ్మ పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పైలట్‌కాలనీలో పూడికతీత పనులను పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే వరదల సమస్యలను అరికట్టే చర్యల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో డ్రెయినేజీ పూడికతీత పనులను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలానికి వరద సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ముందస్తుగా తగు పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం, పిచ్చిమొక్కలను తొలగించే పనలను అధికారులు నిరంతర ప్రక్రియగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన

మణుగూరు మున్సిపాలిటీలోని సురక్షా బస్టాండ్ ఏరియాలో సుమారు రూ.37 లక్షల వ్యయంతో జరుగుతున్న సైడ్ డ్రెయినేజీ పూడికతీత పనులు పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సంబంధిత మున్సిపల్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. జరుగుతున్న పనులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులు పూర్తయితే స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న డ్రెయినేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నిర్మాణ పనులను సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అడపా అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, కుర్రి నాగేశ్వరరావు, బి.నవీన్, మున్సిపల్ ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం నిర్మాణంపై చర్చ

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రూ.5కోట్ల 50లక్షలతో నిర్మించ తలపెట్టిన కార్యాలయ నిర్మాణంపై సోమవారం తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌తో చర్చించారు. భవన నిర్మాణంకు సంబంధించిన మ్యాప్‌ను కలెక్టర్‌కు వివరించారు. సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణ సుందరీకరణ అత్యంత వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు.

ఖురాన్‌తో ద్వేషరహిత సమాజం

మణుగూరుటౌన్: ద్వేషరహిత సమాజాన్ని ఖురాన్ కోరుకుంటోందని బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న అన్నారు. సోమవారం మణుగూరు బీటీపీఎస్ పరిపాలన విభాగం ఆవరణంలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఈద్ మిలాద్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మానవ సమాజంలో సహోదరత్వం, మనిషిని మనిషి గౌరవించుకోనే ప్రజాస్వామిక విలువలు, ద్వేషరహిత సమాజం, విధ్వంస రహిత ప్రగతి గురించి వివరించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటం వల్ల ఆరోగ్యంతోపాటు దైవభక్తి, ఇతరులపై సద్భావం, కుల మతాలకు అతీతంగా మానవులంతా సమానమనే భావాలు పెంపొందుతాయని అన్నారు. అనంతరం ముస్లిం ఉద్యోగులంతా కలిసి సీఈ బిచ్చన్నకు ఖురాన్ బహూకరించారు. సీఈ దంపతులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఈ సయ్యద్, ఆల్తాఫ్ ఉన్నిసా, జైమున్నిసా బేగం, ఎండి.అక్తర్‌హుస్సైన్, సాదిక్‌పాషా, ఎస్‌కె.ఆరీఫ్‌అహ్మద్, సభాత్‌సీమ్, జానిబెగం, భీమత్, షంషుద్దీన్, సాజిత్, రాయ్‌సాబ్, ఎస్‌కె.సలీం, రియాజ్ ఆలీ, నీజీర్‌ఆలీ, సలీం, ఎస్‌కె తాజుద్దీన్, జానీ, షమీనా బేగం, జహారుద్దీన్‌లతోపాటు అన్ని విభాగాల ఏఈలు, డీఈలు, అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్ విజయవంతం



ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న లిటిల్ ఫ్లవర్స్ కళాశాల డైరెక్టర్ మాగంటి ప్రసాద్ బాబు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఎంసెట్ మోడల్ పరీక్షకు మంచి స్పందన లభించిందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ మోడల్ పరీక్షకు వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. రానున్న రోజుల్లో జరగబోయే ఎంసెట్ పరీక్షకు ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. పరీక్షా పత్రాన్ని లిటిల్ ఫ్లవర్ కళాశాల డైరెక్టర్ మాగంటి ప్రసాద్ బాబు విడుదల చేశారు. అనంతరం కళాశాల డైరెక్టర్ ప్రిన్సిపాల్ మాగంటి రమేష్ బాబు మాట్లాడుతూ.. ఇటువంటి పరీక్షలను వినియోగించుకుని ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమములో లెక్చరర్లు బషీర్ తదితరులు పాల్గొన్నారు.

సంతకు స్థలం కేటాయించాలి

అశ్వాపురం: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు సంతకు స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం అశ్వాపురం సెంటర్‌లో సర్పంచ్ బానోత్ శారద ఆధ్వర్యంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఆమెర్ధ రహదారి వెంబడి ఆర్టీసీ స్థలంలో ఎన్నో ఏళ్లు సంత నిర్వహిస్తుండగా ఇటీవల ఆర్టీసీ అధికారులు సంత నిర్వాహణకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆర్టీసీ స్థలంలో సంత నిర్వహణకు ఆర్టీసీ అధికారులు ఏడాదికి రూ.2 లక్షలు అడుగుతుండగా.. గ్రామ పంచాయతీ వారు రూ.60 వేలు ఇస్తామంటున్నారు. ఆర్టీసీ అధికారులు లిఖిత పూర్వకంగా ఇస్తే ఉన్నతాధికారులతో మాట్లాడుతామని గ్రామ పంచాయతీ వారు చెబుతున్నా.. అందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధంగా లేరు. సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో కలెక్టర్, డీపీఓ, ఎంపీడీఓకు పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో సంతకు స్థలం కేటాయించాలని కోరుతూ సర్పంచ్ బానోత్ శారద ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. గంట పాటు ధర్నా చేపట్టగా పోలీసులు చేరుకుని సర్పంచ్, స్థానికులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. సంత స్థలంపై అఖిలపక్ష పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేగా కాంతారావును కలిసి విన్నవించనున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం



మణుగూరురూరల్: మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు లక్ష్మీనారాయణ



అన్నపురెడ్డిపల్లి: రౌండ్ టేబుల్ సమావేశమై నిరసన తెలుపుతున్న వీఓఏలు

చర్ల: ఐకేపీ వీఓఏల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమం ఆగదని తెలంగాణా ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం చర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇర్పా అనురాధ, కె మీనాకుమారి అన్నారు. సమ్మె సోమవారం 22వ రోజుకు చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ దీపికలు పాల్గొన్నారు.

బానిసల్లా చూస్తున్నారు..

బూర్గంపాడు: పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఐకేపీలో ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న గ్రామదీపికలకు కనీస వేతనం చెల్లించకుండా బానిసల్లా చూస్తున్నారని సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య ఆరోపించారు. బూర్గంపాడు ప్రధానకూడలిలోని దీక్షా శిబిరంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. పెరిగిన జీవన ప్రమాణాలకు అనుగుణంగా గ్రామదీపికలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

మణుగూరురూరల్: ఐకేపీ వీఓఏల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆర్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సమ్మె శిబిరాన్ని ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు సోమవారం సందర్శించి తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గత 22రోజులుగా వీవోఏలు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి డి.సుధాకర్, ఏఐటీయూసీ నాయకులు రాజబాబు, కొత్తపల్లి సీతారాములు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 22వ రోజుకు చేరుకుంది. సోమవారం మండల కేంద్రంలో వీఓఏలు రౌండ్ టేబుల్ సమావేశమై తమ నిరసనను తెలిపారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలకుమారి, నాగమ్మ, నాగేశ్వరరావు, వెంకటేష్, సత్యనారాయణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.